# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :141 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 04 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 141 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 04 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## దసరా నుంచి సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ప్రభుత్వ బడుల్లో అల్పాహార పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. దసరా నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని (సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం) ప్రారంభించాలని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పుడు మరింత

మిగతా 2లో...

# బీఆర్ఎస్ దోచుకున్నదంతా కక్కిస్తా..!

- కేసీఆర్ కుటుంబ సభ్యులంతా దోపిడీ చేస్తున్నారు
- ఎంతోమంది బలిదానాలతోనే తెలంగాణ సాకారమైంది
- తెలంగాణ వచ్చాక ఒక కుటుంబమే బాగుపడింది
- ఎన్డీఏలో చేరతానని సీఎం కేసీఆర్ వెంటపడ్డారు
- బీఆర్ఎస్తో పొత్తు పెట్టుకోబోమని కేసీఆర్‌కు తేల్చి చెప్పా
- పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే దేశ ప్రగతి
- దేశ ప్రగతిని ఎవరూ ఆపలేరు.. ఇదే నా లక్ష్యం
- తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

నిజామాబాద్- ప్రభాత సూర్యుడు


తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీవ్యాఖ్యానించారు. తెలంగాణలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. మంగళవారం నాడు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన జనగర్జన సభలో మోదీ మాట్లాడుతూ ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఆస్పత్రులు, రైల్వేలైన్లు నిర్మిస్తున్నాం. ఎన్టిపిసి తో రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి రానుంది. ఎన్టిపిసి పవర్ ప్లాంట్‌తో తెలంగాణలో ఎంతో మార్పు రానుంది. పెద్దపల్లి ఎన్టిపిసి పవర్ ప్లాంట్‌ను శరవేగంగా పూర్తిచేశాం. ఎన్టిపిసి ప్లాంట్ నుంచి తయారయ్యే విద్యుత్‌లో..అధిక భాగం

2 లో



## చంద్రబాబు కేసులు

# 9కి వాయిదా




న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబు లాయర్లు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను మళ్లీ సోమవారానికి వాయిదా పడింది. ఈ సందర్భంగా హైకోర్టులో సమర్పించిన పత్రాలన్నీ సోమవారంలోపు తమకు కూడా సమర్పించాలని సీఐడీ తరపు న్యాయవాదిని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ కేసును కొట్టేయాలని కోరుతూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఇటీవల ఏపీ హైకోర్టు తిరస్కరించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ చంద్రబాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టులో జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం ముందు వాదనలు జరిగాయి. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. అవినీతి

మిగతా 2లో...

# పటాన్‌చెరు కాంగ్రెస్ బరిలో.. మందుమూల సపానదేవ్



- అనూహ్యంగా తెరపైకి కొత్త పేరు !
- కర్ణాటక హస్తం పెద్దలతో రహస్య మంతనాలు ?
- అత్యంత గోప్యంగా టికెట్ దక్కించుకునే పనిలో దేవ్..
- కాటాXసపాన దేవ్‌గా మారనున్న పటాన్ చెరు కాంగ్రెస్ రాజకీయం
- గంపగుత్తాగా ముదిరాజ్ ఓట్లన్నీ సపానకే..!

తెలంగాణ బ్యూరో - ప్రభాత సూర్యుడు

'ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు హీటెక్కాయి. అధికారం బిఆర్ఎస్ పార్టీ 115 స్థానాలకు టికెట్లు ప్రకటించిన నాటి నుండి అందరి దృష్టి పటాన్ చెరు సెగ్మెంట్ పై పడింది. ముఖ్యంగా బిఆర్ఎస్ పార్టీ నుంచి పటాన్చెరు టికెట్ ఆశించి, దక్కకపోవడంతో నీలం మధు బిఆర్ఎస్ పార్టీకి ఏకు మేకై కూర్చున్నాడు. దీంతో పటాన్చెరు నియోజకవర్గం హాట్ టాపిక్ లా మారింది.'


ఇదిలా ఉంటే మొదటి నుంచి పటాన్చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని సింగిల్ హ్యాండ్ తో నడిపించిన పటాన్చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ టికెట్ తనదేనని ధీమా వ్యక్తం చేస్తూ వచ్చారు. సరిగ్గా ఈ తరుణంలోనే పటాన్చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో అనూహ్యంగా ఒక కొత్త ముఖం తెరపైకి రానుంది. ఈ పరిణామంతో పటాన్చెరు హస్తం పార్టీలో కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. పటాన్చెరు కాంగ్రెస్ రేసులో మందుమూల సపాన దేవ్ పేరు తెర మీదకి వచ్చిన నాటి నుండి ఆయన వర్గీయుల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. పటాన్చెరు సర్పంచ్ గా, ఎంపీపీగా, కార్పొరేటర్ గా సేవలందించిన సపాన దేవ్ కు స్థానికంగా మంచి పట్టుంది. పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ నుండి టికెట్ రాకపోవడంతో పటాన్చెరు నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సపాన దేవ్ పటాన్చెరు నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడే.

**కలిసొచ్చే అంశాలు**

మందుమూల సపాన దేవ్ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, పటాన్చెరు

మిగతా 2లో...

## న్యూజెర్సీలో అక్షర ధామ్ ప్రారంభం



వాషింగ్టన్- ప్రభాత సూర్యుడు

ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయం అమెరికాలో అక్టోబర్ 8వ తేదీన ప్రారంభం కానుంది. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం రాబిన్స్‌విల్లె పట్టణంలో నిర్మించిన బీఏపీఎస్ స్వామినారాయణ్ అక్షర్‌ధామ్ ప్రతిష్టాపన ఉత్సవాలు సెప్టెంబర్ 30 అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అక్షరధామ్ మహామందిర్ ప్రారంభ వేడుకలు భారతీయతను ప్రదర్శిస్తాయి. నిర్మాణ నైపుణ్యం, మన అద్భుతమైన ప్రాచీన సంస్కృతి, నీతి.. దీని ప్రారంభోత్సవంతో మరింత మెరుగుపడుతుంది. ఈ ప్రయత్నం శుభప్రదం.. స్వామి నారాయణ సంస్థ, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ శు

మిగతా 2లో...

# తెలంగాణలోనే 24 గంటలు కరెంటు సరఫరా

- 38.4 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయ భవనం ప్రారంభం
- 280 కోట్లతో 3,722 మంది లబ్దిదారులకు డబుల్ బెడ్ రూం లబ్దిదారులకు పంపిణి
- మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి త్రాగు నీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- రాష్ట్ర మున్సిపల్, ఐ.టి. శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామా రావు

జగిత్యాల- ప్రభాత సూర్యుడు

దేశంలో రైతులు పంటలను పండించుకునేందుకు 24 గంటలు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్, ఐ.టి. శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామా రావు అన్నారు. మంగళవారం జగిత్యాల లోని నూతనంగా రూ.38.4 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయ భవనాన్ని, జిల్లా పరిధిలోని మల్యాల మండలంలోని నూకపల్లి గ్రామంలో రూ. 280 కోట్లతో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో మొదటి దశలో పట్టణంలోని 3,722 మంది



నిరుపేద లబ్దిదారుల గృహ ప్రవేశ కార్యక్రమం, వ్యవసాయ మార్కెట్ సమీపంలో రూ.4.50 కోట్లతో నిర్మించిన సమీకృత వెజ్ ? నాన్ వేజ్ మార్కెట్ లను హోమ్ మినిస్టర్ మహమూద్ అలీ, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ లతో కలిసి మంత్రి కేటిఆర్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ

మిగతా 2లో...

## సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టాలని సీఎం కేసీఆర్ కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాసారు. బీసీ కుల గణన చేపట్టాలని సుదీర్ఘ కాలంగా డిమాండ్ ఉంది. బీసీ జనగణన డిమాండ్ కు కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ప్రకటించింది. ఈ విషయంలో బీసీ సంఘాలు చేపట్టిన ప్రతి నిరసన, ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. మహిళా బిల్లును పార్లమెంటులో ఆమోదించిన సమయంలో కూడా

మిగతా 3లో...

# బీఆర్ఎస్ దోచుకున్నదంతా కక్కిస్తా

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణకే కేటాయిస్తాం. ఎన్టిపిసి ప్లాంట్ శంకుస్థాపన చేసింది నేనే.. ప్రారంభించింది నేనే. మా గ్యారంటీలకు ఇదే నిదర్శనమని మోదీ వ్యాఖ్యానించారు.

**ఇది మా వర్క్ కల్చర్**

తెలంగాణకు అండగా ఉంటాం. ఇక్కడి ప్రజల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను బీజేపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. బీజేపీ ప్రభుత్వంశంకుస్థాపనలే కాదు.. ఆ పనులను కూడా సకాలంలో పూర్తి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. తెలంగాణ ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు మేము కృషి చేస్తున్నాం. త్వరలో భారతీయ రైల్వే 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ అవుతుంది. ఇది మా వర్క్ కల్చర్ అని చెప్పారు. బీబీ నగర్‌లో నిర్మిస్తున్న ఎయిమ్స్ భవనం పనులు చాలా తొందరగా పూర్తవుతున్నాయని.. ప్రజలంతా మేము చేసిన పనులను చూస్తున్నారని మోదీ పేర్కొన్నారు.

**పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం**

నేడు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.8 వేల కోట్ల విలువైన పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణలో 20 క్రిటికల్ కేర్ బ్లాకులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను మోదీ జాతికి అంకితం చేశారు. మనోహరాబాద్-సిద్దిపేట రైల్వేలైన్, సిద్దిపేట-సికింద్రాబాద్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్డీఏలో చేరతానని సీఎం కేసీఆర్ వెంటపడ్డారు.. కానీ ఆ ప్రతిపాదనను తాను ఒప్పుకోలేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల తర్వాత కేసీఆర్ ఢిల్లీ వచ్చి కలిశారు. తెలంగాణ పాలన పగ్గాలు మంత్రి కేటీఆర్‌కు ఇస్తానని కేసీఆర్ చెప్పారు. కేటీఆర్‌ను ఆశీర్వదించాలని కేసీఆర్ కోరారు. ఇది రాజరికం కాదు.. ప్రజాస్వామ్యమని కేసీఆర్‌తో చెప్పా. మీరేమైనా రాజులా అని నేను ప్రశ్నించా. ప్రజలు ఆశీర్వదిస్తేనే పాలకులు అవుతారని చెప్పా. బీఆర్ఎస్తో పొత్తు పెట్టుకోబోమని కేసీఆర్‌కు తేల్చి చెప్పా. నాటి నుంచి నా కళ్లలోకి చూడ్డానికి కూడా సీఎం కేసీఆర్ భయపడుతున్నాడు" అని మోదీ హెచ్చరించారు. అవసరం తీరాక కేసీఆర్ ప్రవర్తన మారింది. కేసీఆర్ గతంలో హైదరాబాద్ఎన్నికలపుడు నాతో అప్యాయంగా ఉన్నాడు. ఆర్భాటంగా స్వాగతం పలికాడని ప్రధాని మోదీ అన్నారు. "ఇప్పుడేమైంది? మా అవసరం తీరాక ఆయన ప్రవర్తన మారిపోయింది. మా కార్యకర్తలను ఎన్ని రకాలుగా వేధించినా భయపడేది లేదు. తెలంగాణను ఓ కుటుంబం దోచుకుంటోంది. ఎంతోమంది బలిదానాలతోనే తెలంగాణసాకారమైంది. తెలంగాణ వచ్చాక ఒక కుటుంబమే బాగుపడింది. కేసీఆర్ పాలనలో అవినీతి పెరిగింది. కేసీఆర్, ఆయన కుమారుడు... ఆయన కుమార్తె, అల్లుడు మాత్రమే ధనికులయ్యారు. కేంద్రం ఇచ్చిన నిధులనూ బీఆర్ఎస్ దొచుకుంటోంది. కుటుంబ పాలనకు ప్రజలు మరో అవకాశం ఇవ్వొద్దు. కేసీఆర్ కుటుంబ సభ్యులంతా దోపిడీ చేస్తున్నారు. ఉద్యోగాల్లో అసలైన యువతకు అవకాశం రావడం లేదు. నమ్మకం ఉంచి టి.బీజేపీకి అవకాశం ఇవ్వండి. బీఆర్ఎస్ దోచుకున్నదంతా కక్కిస్తా" అని మోదీ పేర్కొన్నారు.

**వాళ్లిద్దరూ తెరచాటు ఒప్పందాలు చేసుకున్నారు..**

తెలంగాణ ప్రజల్లో చాలా టాలెంట్ ఉంది. కరోనాకు మందు కనిపెట్టారని మోదీ చెప్పారు. "నిజాం నవాబులు హైదరాబాద్‌ను వదలకపోతే ఒకే ఒక్క గుజరాతీ బిడ్డ వల్లభాభాయ్ పటేల్ వారిని తరిమేశారు. ఈ రాష్ట్రంలో కుటుంబ పాలన అవసరం లేదు. వేలాది మంది బలిదానం చేసి సాధించిన రాష్ట్రాన్ని ఒకే కుటుంబం కబ్జా చేసింది. ఇక్కడి ప్రజల కలలను తుంచేశారు. కాంగ్రెస్ వారితో కూడా అప్రమత్తంగా ఉండాలి. కాంగ్రెస్ ఒకసారి అధికారంలోకి వచ్చిన రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రాదు. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌తో సంబంధం ఉంది. వాళ్లిద్దరు తెరచాటు ఒప్పందాలు చేసుకున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్, బీఆర్ఎస ‾(అనీనిణతీవబబ, ఃఖీూ)కు ఇలాగే చీకటి ఒప్పందాలు జరిగాయి. ఎన్టీపీసీ విద్యుత్ ఉత్పత్తిని తెలంగాణకే వినియోగిస్తున్నారు. రైల్వే, ఆరోగ్య పథకాలు తెలంగాణ ప్రజలకు అంకితం చేశాం. నిజామాబాద్ మహిళలు, రైతులకు ధన్యవాదాలు. మీరు ఇచ్చిన అపురూప స్వాగతంతో ధన్యుడిని. ఈ ఎన్నికల్లో నారీ శక్తి చూపించాలి. మీ ఓట్ల బలంతో వాళ్లు బలవంతులు అయ్యారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**మందిరాలపై ప్రభుత్వ పెత్తనం**

మందిరాలపై ప్రభుత్వ పెత్తనం సాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. "మందిరాల స్థలాలు కబ్జా చేస్తున్నారు.. ఆస్తులు లాక్కుంటున్నారు.కానీ, మైనార్టీ ప్రార్థన మందిరాలపై ఇలాంటి చర్యలు తీసుకోగలరా..? హిందు మందిరాలను నడిపించే హక్కు హిందువులకే ఇవ్వగలరా..? పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే దేశ ప్రగతిని ఎవరూ ఆపలేరు. ఇదే నా లక్ష్యం. తెలంగాణలో మరో ఐదేళ్లు దోపిడీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారు. మా వాళ్లను గెలిపించండి.. మీ పాదాల దగ్గర ఉంచుతా. బీజేపీ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ పాపాలను ఒక్కొక్కటి బయటకు తీస్తాం" అని హెచ్చరించారు.

## దసరా నుంచి సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

(మొదటిపేజీ తరువాయి)

ముందుగానే ఈ స్కీమ్ ను అమలు చేయాలని భావిస్తోంది. శాసనసభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలు ఉండటంతో.. అంతకు ముందుగానే సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం ను అమలు చేయనుంది. ఈ నెల 4వ తేదీ నుంచే ప్రారంభించాలని మొదట అనుకున్నారు. అయితే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెద్ద మొత్తంలో గౌరవ వేతనం, బిల్లులు పెండింగ్ లో ఉన్నందు వల్ల, ఆ చెల్లింపులు పూర్తి చేసిన తర్వాత ఈ నెల 6వ తేదీ నుంచి అల్పాహార పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయానికి వచ్చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అల్పాహార పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. అదే రోజు ఆయా జిల్లాల్లో మంత్రులు ఈ పథకాన్ని ప్రారంభించేలా సన్నాహాలు మొదలు పెట్టారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒకటి నుంచి పదో తరగతి తరగతుల విద్యార్థులకు ఉదయం సమయంలో అల్పాహారం అందించనున్నారు. ఈ పథకాన్ని అక్టోబర్ 24వ తేదీన లాంఛనంగా ప్రారంభించాలని మొదట ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. ఈ పథకం అమలు చేయడానికి గానూ ఒక విద్యా సంవత్సరానికి దాదాపు రూ. 400 కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు అంచనా వేశారు. అల్పాహార పథకాన్ని ముందస్తుగా ప్రారంభించాలని నిర్ణయించిన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి.. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ నుంచి దసరా సెలవులు ఉన్నందు వల్ల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 6 రోజుల పాటు జిల్లాకు ఒక పాఠశాలలో అమలు చేయాలని అధికారులకు నిర్దేశించారు.అల్పాహార పథకాన్ని అమలు చేయడానికి మన ఊరు – మన బడి కార్యక్రమం కింద పనులు పూర్తి అయిన పాఠశాలలను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేయగల ప్రధాన ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలలనే మొదటగా ఎంచుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, సంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల మధ్యాహ్న భోజన పథకం అక్షయపాత్ర సంస్థ ద్వారా అమలు అవుతోంది. అక్కడ ఆ సంస్థకే అల్పాహారం అందించే బాధ్యత ఇవ్వనున్నారు. దసరా సెలవుల అనంతరం ఈ నెల 26వ తేదీన మళ్లీ బడులు మొదలు కానున్నాయి. అప్పటి నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేస్తారా.. లేదా అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.అల్పాహారంలో ఏయే పదార్థాలు అందించాలి అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. విద్యా శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో.. మెనూ విషయంపై అడగ్గా.. మెనూ గురించి తర్వాత చెబుతామంటూ ఉన్నతాధికారులు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఆమోదం తర్వాతే మెనూపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయని విద్యా శాఖ అధికారులు పేర్కొన్నారు.

## చంద్రబాబు కేసులు
## 9కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ కింద గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా కేసు నమోదు చేశారని లాయర్ హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. రాజకీయ ప్రతీకారానికి వ్యతిరేకంగా సెక్షన్ 17ఎ తీసుకొచ్చారని..ఈ కేసులో ఆ సెక్షన్ వర్తిస్తుందా? లేదా? అన్నదే ప్రధానమని అన్నారు. ఆరోపణలు ఎప్పుడు వచ్చాయనేది కాదని.. కేసు నమోదు, విచారణ ఎప్పుడు అనేది చర్చించాలని హరీశ్ సాల్వే వాదించారు.. బాబు క్వాష్ పిటిషన్ విచారణ సందర్భంగా.. 17% చుట్టూ వాదనలు కొనసాగాయి. 17% వర్తిస్తుందని చంద్రబాబు లాయర్లు వాదించగా.. వర్తించదని సీఐడీ తరపున లాయర్లు వాదించారు. కీలక వాదనల అనంతరం ధర్మాసనం క్వాష్ పిటీషన్‌పై తీర్పును వాయిదా వేసింది. చంద్రబాబు తరపున సీనియర్ లాయర్లు అభిషేక్ సింఘ్వి, హరీష్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా.. సీఐడీ తరపున ముకల్ రోహత్గీ.. జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేది బెంచ్ ముందు వాదనలు వినిపించారుఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో అవినీతి జరిగిందని సీఐడీ కేసు పెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో మాజీ సీఎం చంద్రబాబును కూడా నిందితుడిగా పేర్కొని అరెస్టు కూడా చేశారు. అయితే, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్‌ను గత నెల మూడో వారంలో దాఖలు చేశారు.

## న్యూజెర్సీలో అక్షర ధామ్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

భాకాంక్షలు.. అంటూ ప్రధాని మోడీ పేర్కొన్నారు. సెప్టెంబరు 2023లో భారత్ వేదికగా జరిగిన ఉ20 శిఖరాగ్ర సమావేశం జరిగిన విషయం తెలిసిందే. న్యూఢిల్లీ వేదికగా జరిగిన జీ20 సమ్మిట్ కు హాజరైన యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాన మంత్రి రిషి సునక్.. అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తన ఆలోచనలు, అభిప్రాయాలను పంచుకున్నారు. "ఈ ఆలయ సౌందర్యం, దాని విశ్వవ్యాప్త శాంతి సందేశం చూసి మేము ఆశ్చర్యపోయాము.. సామరస్యం, మంచి మానవుడిగా మారేందుకు ఇది మంచి ప్రార్థనా స్థలం మాత్రమే కాదు.. చరిత్రకు మైలురాయి.. భారతదేశ విలువలు, సంస్కృతి, ప్రపంచానికి అందించిన సేవలను కూడా చూపిస్తుంది.." అంటూ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఃంఖూ ఆధ్యాత్మిక అధిపతి మహంత్ స్వామి మహారాజ్ నుంచి ప్రధాన మంత్రి రిషి సునక్ ఆశీస్సులు పొందారు. అంతేకాకుండా, యూఎస్ లో పవిత్రమైన మరో అందమైన స్వామినారాయణ అక్షరధామ్ ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా రిషి సునాక్.. బాప్స్ సంస్థ, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. రాబిన్స్‌విల్లేలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన అక్షరధామ్ ప్రతిష్ఠాపన వేడుక ప్రారంభమైంది.స్వామినారాయణ్ అక్షరధామ్ దేవాలయాన్ని మహంత్ స్వామి మహారాజ్ మార్గదర్శకత్వంలో నిర్మితమైంది. ఈ అక్షర్‌ధామ్ ప్రతిష్ఠాపన వేడుకలు 9 రోజులపాటు పవిత్ర మహంత్ స్వామి మహారాజ్ సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. అమెరికాలో అక్షర్‌ధామ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాధినేతలతోపాటు.. నలువైపుల నుంచి ప్రముఖులు బీఏపీఎస్ స్వామినారాయణ్ అక్షర్‌ధామ్ ట్రస్టుకు శుభాకాంక్షలు చెప్పడంతోపాటు.. మద్దతును అందిస్తున్నారు.12 సంవత్సరాలకు పైగా దీనిని నిర్మించారు. 12,500 మంది వాలంటీర్లు ఈ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. ఉత్తర అమెరికా అంతటా ఈ రాతి మహామందిర్ అక్షరధామ్ కేంద్రబిందువుగా మారనుంది. అద్భుతమైన నైపుణ్యాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా నిర్మించిన ఈ ఆలయంలో కళాత్మకతను కూడా మిళితం చేస్తుంది. ఆధ్యాత్మికత, సామరస్యం, శాంతికి దీటుగా ఈ అక్షరధామ్ ప్రపంచ ఆకర్షణగా నిలిచిపోనుంది.

## పటాన్ చెరు కాంగ్రెస్ బరిలో
## మందుమూల సపాన దేవ్ ?

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు గణనీయంగా ఉండడం సపాన దేవ్ కు ప్రధానంగా కలిసి వచ్చే అంశం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ బలోపేతానికి జిల్లా వ్యాప్తంగా ఎంతో కృషి చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికీ తెలుగుదేశం పార్టీ అభిమానులు, మైనారిటీలు సపానా దేవ్ కు ఉన్న పాత పరిచయాలు ఆయన విజయానికి బాగా కలిసి వస్తుందని ఆయన సన్నిహితుల్లో నడుస్తున్న చర్చ. పటాన్చెరు నియోజకవర్గంలో అశోక్ నగర్, బీహెచ్ఈఎల్, రామచంద్రపురం, అమీన్పూర్, ఇస్నాపూర్ ముత్తంగి, పటాన్చెరు టౌన్, ఇంద్రేశం, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ( ఓడిఎఫ్), బొల్లారం, జిన్నారం, గుమ్మడిదల, మండలంలోని వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, చాలా మంది తెలుగుదేశం పార్టీ అభిమాన ఓటర్లు పటాన్చెరు నియోజక వర్గంలో ఉండడంతో ఆ ఓట్లన్నీ కూడా సపాన దేవ్ కు అనుకూలిస్తాయి. అంతేకాకుండా నియోజకవర్గంలో 60 నుంచి 70 వేల బిసి, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఉండటంతో, ఈసారి కాంగ్రెస్ టికెట్ సపాన దేవ్ కు ఇస్తే ముదిరాజ్, బహుజన వర్గాల ఓట్లన్నీ గంపగుత్తాగా పడుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా స్వతంత్ర అభ్యర్థిగా పటాన్చెరు బరిలో నిలబడి 1200 అతి స్వల్ప ఓట్ల మెజారిటీతో ఓటమిని చవిచూసిన సపాన దేవ్ పై నియోజకవర్గ ప్రజలలో ఉన్న సానుభూతి సపాన దేవ్ గెలుపుకు దోహదపడుతుందని నియోజ కవర్గంలో బాహాటంగానే చర్చ నడుస్తోంది.

**బిఆర్ఎస్ పై ఉన్న వ్యతిరేకతే కీలకం**

ముఖ్యమంత్రి కెసిఆర్ పటాన్చెరు నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరిగి గూడెం మహిపాల్ రెడ్డిని ప్రకటిం చటంతో ఓసి, బిసి టికెట్ల పంచాయతీగా బిఆర్ఎస్ లో మొదలైంది. గత రెండు పర్యాయాలు పటాన్చెరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్ రెడ్డి అవినీతి పాలన చేస్తూ, భూదందాలకు పాల్పడుతూ, స్థానిక పరిశ్రమల యజమానులను బెదిరిస్తూ, ప్రజలకు అందుబాటులో లేకుండా ఎమ్మెల్యే గిరిని అడ్డుపెట్టుకొని అనతి కాలంలోనే వేలకోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిం చాడని., బిఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉంటానంటూ నీలం మధు ఆత్మీయ సమ్మేళన సభలు పెట్టి బాహాటంగా ఆరోపిస్తున్నాడు. కెసిఆర్ ప్రకటించిన పటాన్చెరు నియోజకవర్గ సీటు విషయంలో పునరాలోచించి బిఆర్ఎస్ టికెట్టు తనకే ఇవ్వాలని పెద్ద ఎత్తున నియోజకవర్గంలో నీలం మధు ప్రచారం చేస్తున్నాడు. రెబల్ అభ్యర్థి నీలం మధు బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు నుండి పార్టీలో పని చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలలో విస్తృతంగా తీసుకుపోయిన తనకు బిఆర్ఎస్ పార్టీ టికెట్టు ఇవ్వాల్సిందేనని ఆత్మీయ సమ్మేళన సభలు పెట్టి కెసిఆర్, కేటీఆర్ లకు కునుకు లేకుండా చేయడమే కాకుండా రెబెల్ అభ్యర్థిగా నీలం మధు పోటీ లో ఉంటే పటాన్చెరు సీటు ఓడిపోవడం ఖాయం అన్న సంగతి బిఆర్ఎస్ పెద్దలకు తలనొప్పిగా మారింది.

**సపాన దేవ్ గెలుపుకు కాసాని జ్ఞానేశ్వర్ అండదండలు?**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి క్రియాశీలకంగా పనిచేసిన సపాన దేవ్ కు ఇప్పటికీ నియోజకవర్గంలో ఎంతో మంది తెలుగుదేశం అభిమానులు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కు సపాన దేవ్ స్వయాన మేనల్లుడు కావడంతో, నియోజకవర్గంలోని తెలుగుదేశం శ్రేణులు, అభిమానుల అండతో సపాన దేవ్ గెలుపుకు జ్ఞానేశ్వర్ సహకారం పరోక్షంగా ఉంటుందని, ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

**కమ్యూనిస్టుల పొత్తుతో సపాన దేవ్ గెలుపు తథ్యం**

వామపక్షపార్టీలైన సిపిఐ, సిపిఎంలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకోవాలని, మూడు పార్టీల మధ్య చర్చలు జరుగుతున్న సమయంలో వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తు కుదిరితే పాశమైలారం, జిన్నారం, గుమ్మడిదలతో పాటు పటాన్చెరు పారిశ్రామిక ప్రాంతాలలోని వామపక్ష పార్టీల అభిమానులు, కార్మిక సంఘాల కుటుంబాల ఓట్లు సైతం సపాన దేవ్ గెలుపుకు మరో అదనపు బలంగా స్థానిక అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు చర్చిస్తున్నారు. స్థానికుడైన సపాన దేవ్ ఎన్నికల బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉంటే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డికి దీటైన వ్యక్తి సపాన దేవే అని అభిమానులు, స్నేహితులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కోరుకుంటున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అభ్యర్థిగా సపాన దేవ్ కు టికెట్ రావాలని ఆయన అభిమానులు, అనుచర వర్గం పూజలు చేయడం విశేషం.

## తెలంగాణలోనే 24 గంటలు కరెంటు సరఫరా

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కరెంటు కష్టాలు ఎక్కువగా ఉండేవని, రైతులు పంటలను పండించడానికి ఇబ్బంది పడుతుండేవారని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కరెంటు కష్టాలతో పాటు నీటి కష్టాలు కూడా తొలగించుటకు వెయ్యి కోట్లు ఖర్చు పెట్టి రివర్స్ పంపింగ్ ద్వారా జలకళలను సృష్టించి నిండు కుండలా జలాశయాలు మారుటకు కృషి చేసిన ఏకైక నాయకుడు మన రాష్ట్ర ముఖ్య మంత్రి కేసిఆర్ అని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రజల త్రాగు నీటి సమస్యలను తొలగించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటింటికి త్రాగు నీరు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. జిల్లా ఏర్పాటు తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఇతర జిల్లాలకు వెళ్లి ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో అధికారులు అందరూ ఒకే దగ్గర ఉండే విధంగా సమీకృత అధికారుల భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అదే విధంగా పోలీసు అధికారులందరిని ఒకే దగ్గర ఉండి విధంగా సమీకృత పోలీస్ అధికారుల భవనాన్ని ప్రారంభించుకున్నామని మంత్రి తెలిపారు.. రైతు పడే సమస్యలు ఒక రైతు బిడ్డగా మన రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలుసని, రైతు బాధపడకుండా ఉండటానికి మన ముఖ్యమంత్రి ఎప్పుడు కృషి చేస్తారని మంత్రి తెలిపారు. రైతుకు కష్టం వస్తే రైతు భీమా, రైతు పంటలకు రైతు బంధు పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. 4 లక్షల 25 వేల మంది బి.డి కార్మికులకు నెలకు 2 వేల రూపాయల పెన్షన్ అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అని అన్నారు. అదే విధంగా పేదింటి ఆడబిడ్డలు పెళ్ళి చేయుటకు వారికీ ఒక మేనమామ లాగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆదుకుంటున్నారని మంత్రి తెలిపారు. కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు ఉచితంగా పంపిణి చేయడం జరుగుతుందని అన్నారు.ఆనంతరంరాష్ట్ర హోమ్ శాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ అన్ని వర్గాలతో పాటు ముస్లిం వర్గాలకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలుపరుస్తున్నారని అన్నారు. షాదీ ముబారక్, రెండు పడుక గదుల ఇండ్ల కేటాయింపులో నిరుపేద ముస్లిం కుటుంబాలకు అందిస్తున్నారని తెలిపారు. మైనారిటి పిల్లలకు విద్యాభ్యాసానికి రెసిడెన్షియల్ పాఠశాలకు, కళాశాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, విద్యాసాగర్ రావు, సుంకే రవి శంకర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పార్లమెంట్ సభ్యులు వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, రమణ, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, ఎస్పి ఎగ్గడి భాస్కర్, జెడ్పి చైర్పర్సన్ వసంత, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్, అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, దివారక, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# అంతుచిక్కని కమల వ్యూహం....

భారతీయ జనతా పార్టీ అంతరంగం అంతుచిక్కడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో బిజెపి వైఖరి సొంత పార్టీ శ్రేణులను విస్మయ పరుస్తోంది.తెలంగాణలో దూకుడుగా ఉన్న బండి సంజయ్ నాయకత్వాన్ని మార్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈటెల రాజేందర్ కు సైతం కీలక పదవి ఇచ్చారు. గతం కంటే బిజెపి పరిస్థితి మెరుగుపడిందా? అంటే అది కనిపించడం లేదు. ఎన్నికల సమీపించే కొద్దీ పార్టీ పరిస్థితి తీసికట్టుగా మారుతోంది. ఇక ఏపీలోనూ అదే పరిస్థితి. అదే కన్ఫ్యూజన్. రెండు చోట్ల అధికార పార్టీతో లోపయికారీ ఒప్పందం చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.తెలంగాణలో బండి సంజయ్ మార్పు తర్వాత అద్భుతాలు జరుగుతాయని చెప్పుకొచ్చారు. అధికార బి ఆర్ ఎస్, విపక్ష కాంగ్రెస్ నుంచి బడా నేతలు క్యూ కడతారని ప్రచారం చేసుకున్నారు. కానీ మూడు నెలలు అవుతున్నా ఒక్కడంటే ఒక్క పెద్ద నేత సైతం చేరలేదు. గ్రౌండ్ లెవెల్ లో ఇతర పార్టీలో అవకాశం దక్కని వారు మాత్రమే బిజెపిలోకి వస్తున్నారు. అన్నింటికీ మించి బిజెపి నుంచి కీలక నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కనీసం తెలంగాణలో రెండో స్థానం వస్తాది అనుకున్నారు.. కానీ కనీసం మూడో ప్లేస్ లో ఎక్కడ ఉంటుందో తెలియని స్థితిలో బిజెపి ఉంది. ఈ తరుణంలో తెలంగాణ ఎన్నికల కోసం ఓ జంబో కమిటీని ఏర్పాటు చేశారు.వివిధ రాష్ట్రాలకు చెందిన బిజెపి కీలక నాయకులు, కేంద్ర మంత్రులతో బిజెపి హై కమాండ్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఎన్నికల్లో అనుసరించాల్సిన తీరు, అభ్యర్థుల ఎంపిక, ఎలక్షన్ క్యాంపెయిన్ వంటి వాటిపై ఈ కమిటీ దృష్టి పెట్టనుంది. ఏపీ నుంచి బిజెపి మాజీ అధ్యక్షుడు సోమ వీర్రాజుకు ఈ కమిటీలో స్థానం దక్కడం విశేషం. అటు కర్ణాటక, తమిళనాడు, గోవాల నుంచి బిజెపి నాయకులకు ఈ కమిటీలో స్థానం దక్కింది. తెలంగాణ ఎన్నికల కమిటీలు ఇతర రాష్ట్రాల నాయకులకు చోటు ఇవ్వడం ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.తెలంగాణ బిజెపి అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్ ని తప్పించారు. ఆయన హయాంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణలో బలోపేతం అయిందని ఒక టాక్ ఉండేది. వచ్చే ఎన్నికల్లో అధికారానికి వచ్చే అవకాశం ఉందని.. లేకుంటే ప్రధాన ప్రతి పక్ష స్థానం అయినా దక్కే ఛాన్స్ ఉందని టాక్ నడిచింది. కానీ అనూహ్యంగా బండి సంజయ్ ను తప్పించి జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఏపీ అధ్యక్షుడుగా ఉన్న సోము వీర్రాజును తప్పించారు. ఆయనకు మాత్రం మొండి చేయి చూపారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల కమిటీలో సోము వీర్రాజుకు తీసుకున్నారు. బండి సంజయ్ ను ఎలా వినియోగించుకుంటారో తెలియడం లేదు. ఈ తరుణంలో తెలుగు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ వ్యూహాత్మక తప్పిదానికి పాల్పడుతోందని విశ్లేషణలు వెలువడుతున్నాయిప్రధాని సమావేశానికి గైర్హాజరైన వారిలో ఆదిలాబాద్‌కు చెందిన బీజేపీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జీ వివేక్ వెంకటస్వామి, ఎం విజయశాంతి, మాజీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జీ విజయరామారావు, ఏనుగు రవీందర్‌రెడ్డి ఉన్నారు.మోదీ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు జీ లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మరికొందరు నేతలు మాత్రమే పాల్గొన్నారు.ప్రధానమంత్రి సమావేశానికి ఇతర సీనియర్ నేతలు గైర్హాజరు కావడం ఖచ్చితంగా పార్టీకి తప్పుడు సంకేతాన్ని పంపిందని తెలంగాణ బీజేపీ నాయకుడు ఒకరు చెప్పారు. బాపురావు త్వరలో కాంగ్రెస్‌లోకి మారే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. మోదీ పర్యటన సందర్భంగా అతడిని సంప్రదించడానికి ప్రయత్నించామని, కానీ అతను పార్టీకి అందుబాటులో రాలేదని అతని అనుచరులు కూడా సమావేశానికి రాలేదన్నారు. అటు ఏపీలోనూ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయం రకరకాల మలుపులు తిరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఊహించని రీతిలో అరెస్ట్ కావడం, ఆ తర్వాత జైలుకి వెళ్లడంతో రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును పరామర్శించడానికి వెళ్లిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొత్తుల ప్రకటన చేయడంతో ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా మారిపోయాయి. అంతకుముందు చంద్రబాబు-పవన్ కళ్యాణ్ భేటీ అయినప్పటికీ పొత్తులపై ఎన్నికలప్పుడే నిర్ణయం తీసుకుంటామని చెప్పుకుంటూ వచ్చారు. అప్పటివరకూ రాష్ట్రాన్ని కాపాడటమే తమ లక్ష్యం అంటూ ఇరువురు నేతలు చెప్పుకొచ్చారు. దీంతో ఎవరికి వారే ఆయా పార్టీల తరపున కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వచ్చారు. ఇక పవన్ కళ్యాణ్ మాత్రం బీజేపీతో పొత్తు విషయంలో ఎలాంటి ప్రకటనలు చేయకపోయినా.. బీజేపీ నేతలు మాత్రం తాము జనసేనతోనే పొత్తులో ఉన్నామని చెప్పుకుంటూ వచ్చారు. టీడీపీతో పొత్తు ప్రకటన సందర్భంగా పవన్ కళ్యాణ్ కూడా బీజేపీ కలిసొస్తుందో.. లేదో.. చెప్పలేనని

## గ్రామ ప్రజల

# సమస్యల పరిష్కారానికి కృషి

### సర్పంచ్ శిల్పా రెడ్డి, గురునాథ్ రెడ్డి

**కౌతాళం - ప్రభాత సూర్యుడు :** బాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది ఈ గ్రామ సభకు ముఖ్య అధ్యక్షత వహించిన సర్పంచ్ శిల్ప రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న డ్రైనేజ్ సమస్యలు అయితేనేమి వీధిలైట్లు, సిసి రోడ్లు మిగతా సమస్యలను త్వరలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి గ్రామాన్ని అభివృద్ధి మరియు సంక్షేమ వైపు కృషీ చేస్తామని పేర్కన్నారు. అనంతరం వైసిపి యువ నాయకులు గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి ప్రతి ఒక్క కుటుంబాన్ని సందర్శించి వారి రోగాలను గుర్తించి వారికి ఉచితంగా వైద్య సదుపాయం కల్పించాలని హెచ్చరించారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అబ్దుల్ వాహీద్, వీఆర్వో రామాంజనేయులు, ఉప సర్పంచ్ రామాం జనేయులు ఎంపీటీసీ సౌభాగ్యమ్మ, వైసిపి నాయకులు అయ్యప్ప రెడ్డి, రాఘవరెడ్డి శ్రీనివాసరెడ్డి, పామరెడ్డి, దేవరెడ్డి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి ఆయాలు , ఆశ వర్కర్లు, సచివాలయ కన్వీనర్, గృహ సారధులు, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తాండూర్ లో శంకుస్థాపనల జోరు

- గతంలో ప్రజాసంక్షేమాన్ని మరిచారు
- ప్రజా సంక్షేమంలో మాకు,మేమే పోటీ
- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**తాండూర్ - ప్రభాత సూర్యుడు :** బెల్లంపల్లి నియోజ కవర్గంలో నీ తాండూరు మండలంలో మంగళవారం శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య సుడిగాలి పర్యటనలు చేశారు. పర్యటన అధ్యంతం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ సందర్భంగా శాసన సభ్యులు దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ గతంలో నీ పాలకులు ప్రజాసంక్షేమాన్ని మరిచి, పరిపాలనను కొనసా గించాలని ఆయన స్పష్టం చేశారు.ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకొని వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమంలో మాకు మేమే పోటీలు పడుతూ పరిపాలనను కొనసాగిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెల్లో ప్రగతి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారం చేపట్టి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. మొదటగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అభినవ సంతోష్ కుమార్, చంద్రశేఖర్, విగ్నేష్, భాస్కర్, రమేష్, లచ్చన్న తదితరులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.సుభద్ర కాలనీ, రాజీవ్ నగర్ ,కిష్టంపేట, పోచంపల్లి ,మాదారం, నిలాయపల్లి, తాండూర్ ,అచలాపూర్, రేచిని గ్రామాల్లో కలియ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటు. సిసి రోడ్ల,తాండూర్ లో మిని స్టేడియం నిర్మాణానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, జడ్పిటీసీ సాలిగామ బానయ్య,ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ సత్యనారాయణ, కో ఆప్షన్ రెహమత్ ఖాన్, ఎంపీటీసీలు సిరంగి శంకర్,పేర్క రజిత, గుమస స్వాతి, పిఏసీఎస్ చైర్మన్ దత్తుమూర్తి, రైతు బంధు సమన్వయ సమితి అధ్యక్షుడు దత్తాత్రేయ, సర్పంచులు సార్ల పద్మ, కిష్టఫర్, నవీన్, సాగరిక, రమేష్, రేపాక సునీత, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పురుషోత్తం గౌడ్,మాజీ జడ్పిటీసీ మంగపతి సురేష్, గ్రామపంచాయతీ కోఆప్షన్ మెంబర్ ఎల్క రామ్ చందర్, యూత్ ప్రెసిడెంట్ గణపతి అంజి, వైస్ ప్రెసిడెంట్ మంతెన శివకృష్ణ, ప్రజా ప్రతినిధులు రుకుం సంతోష్, బోడ సతీష్, జావీద్, ఆసిఫ్, బొనగిరి నరేష్, మంగీలాల్, తిరుపతి, జాడి పోషం, దామయ్య, దుట శ్రీను, ఎర్రయ్య, రవి, క్రాంతి, హనీఫ్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

(మొదటిపేజీ తరువాయి)

మా పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా బీహార్ రాష్ట్రంలో బీసీ జనగణనను విజయవంతంగా చేపట్టింది. ఆ వివరాలను నిన్న విడుదల కూడా చేసిందని అన్నారు. బీసీ కుల గణనతోనే బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుంది. బీసీ కుల గణనతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16 ప్రకారం, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు కల్పించిన రిజర్వేషన్ మరింత కట్టుదిట్టంగా అమలు చేసే అవకాశం ఉంటుంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ జనగణన డిమాండ్ ను పట్టించుకోవడం లేదు. బీసీనని చెప్పుకొని అధికారంలోకి వచ్చిన మోదీ కూడా బీసీల న్యాయమైన డిమాండ్ ను నేరవేర్చడంలేదు. మీ ప్రభుత్వం కూడా బీసీ సంక్షేమాన్ని గాలికొదిలేసింది. బీసీలకు ఎంతో చేస్తున్నామని చెప్పుకోవడమే తప్ప చేసింది శూన్యం. బీసీ సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీ తెస్తామన్నా మాట ఉత్తముచ్చటగా మిగిలిపోయింది. తక్షణమే బీసీ కుల గణనతో పాటు సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. అప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలకు న్యాయంగా దక్కాల్సిన వాటా దక్కుతుందని అన్నారు.

# నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

## ఒకే రోజులో 24 మంది ప్రాణాలు కోల్పోయిన తీవ్ర విషాదం

**ముంబై- ప్రభాత సూర్యుడు :** మహారాష్ట్రలోని నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకే రోజులో 24 మంది ప్రాణాలు కోల్పోయిన తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కేవలం 24 గంటల వ్యవధిలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో 12 మంది చిన్నారులు ఉన్నారు. నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలో ఈ ఘటన జరిగింది. చనిపోయిన 12 మంది శిశువులు వివిధ ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వచ్చినవారు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆస్పత్రిలో మరణించిన వారు వివిధ రకాల కారణాలతో చనిపోయిన వారు అని మహారాష్ట్ర వైద్య, విద్య పరిశోధన డైరెక్టర్ దిలీప్ వెల్లడించారు. కాగా రోగుల్లో కొందరు పాము కాము వల్ల మరణించారని ఆస్పత్రి డీన్ శంకర్ రావు తెలిపారు. ఆస్పత్రిలో మెడిసిన్ తక్కువగా ఉండడమే కాకుండా సిబ్బంది సరిపడినంత మంది లేరని దీని వల్ల తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆస్పత్రి డీన్ తెలిపారు. చనిపోయిన పెద్దవారిలో ఎక్కువ మంది పాము కాటు వల్ల మరణించారని చెప్పారు. అలాగే ఆరుగురు మగ శిశువులు, ఆరుగురు ఆడ శిశు వులు గత 24 గంటల్లో మరణించారని, వారు వేర్వేరు ఆస్పత్రుల నుంచి ఇక్కడి వచ్చారని డీన్ తెలిపారు. అయితే పలువురు సిబ్బంది బదిలీ అయినప్పటి నుంచి సమస్యలను ఎదుర్కొంటున్నామని ఆయన తెలిపారు. నాందేడ్ ఆస్పత్రిలో తృతీయ స్థాయి సంరక్షణ కేంద్రం ఉందని, ఇక్కడ 70 నుంచి 80 కిలోమీటర్ల రేడియస్‌లో ఈ ఒక్కటే ఇలాంటి సంరక్షణ కేంద్రం ఉందని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తున్నారని, రోగుల సంఖ్య పెరిగిపోయి నిధులకు సమస్య ఏర్పడుతోందని డీన్ శంకర్ రావు చవాన్ వెల్లడించారు. మెడిసిన్ కొరత ఉండడంతో తాము ప్రైవేటుగా మందులు కొని రోగులకు అందించామని డీన్ తెలిపారు. అయితే డీన్ వాదనలను తోసిపు చ్చుతూ ఆసుపత్రి నుంచి ఒక పత్రికా ప్రకటన వెల్లడించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు ఉన్నాయని, ఆస్పత్రిలో రూ.12కోట్ల నిధులు ఉన్నాయని, ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.4కోట్లు ఆమోదించారని ప్రకటనలో పేర్కొన్నారు. రోగులకు అవసరమైన చికిత్సలు అందుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రకటనలో.. చనిపోయిన 12 మంది పెద్ద వాళ్లలో ఐదుగురు పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నట్లు తెలిపారు. వీరిలో నలుగురు గుండె జబ్బులతో, ఒకరు పాము కాటు వల్ల, ఒకరు గ్యాస్ట్రిక్ సమస్యతో, ఇద్దరు కిడ్నీ వ్యాధులతో, ఒకరు ప్రసూతి సస్యలతో, మరో ముగ్గురు ప్రమాదాల కారణంగా చనిపోయారని వెల్లడించారు. చిన్నారుల్లో నలుగురిని చాలా సీరియస్ స్టేజ్‌లో ఉండగా ప్రైవేటు ఆస్పత్రుల నుంచి తీసుకొచ్చినట్లు చెప్పారు.అయితే ఈ ఘటనపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేసి మంగళవారం మధ్యాహ్నానికల్లా నివేదిక ఇవ్వాలని ఆస్పత్రి అధికారులను ఆదేశించినట్లు వైద్య విద్య పరిశోధన డైరెక్టర్ దిలీప్ వెల్లడించారు. పరిస్థితిని సమీక్షించడానికి తాను వ్యక్తిగతంగా ఆస్పత్రిని సందర్శిస్తానని తెలిపారు. నాందేడ్ ఆస్పత్రిలో సంభవించిన మరణాలు దురదృష్టకరమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. ఆస్పత్రిలో ఏం జరిగింది అనే అంశంపై మరింత సమాచారం సేకరించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆస్పత్రిలో మరణాలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ట్రిపుల్ ఇంజిన్ సర్కారు (బీజేపీ, ఏక్‌నాథ్ షిండే సేన, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం) దీని పట్ల బాధ్యత వహించాలని ప్రతిపక్షాలు దుయ్యబడుతున్నాయి. '24 మంది ప్రాణాలు కోల్పోయారు. 70 మంది పరిస్థితి విషమంగా ఉంది. సిబ్బంది సదుపాయాల కొరత ఉంది. చాలా మంది నర్సులను బదిలీ చేశారు. 500 మంది సామర్థ్యం ఉన్న ఆస్పత్రిలో 1200 మంది రోగులు ఉన్నారు. ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దాలి' అని కాంగ్రెస్ నేత అశోక్ చవాన్ ఆస్పత్రిని సందర్శించిన తర్వాత వెల్లడించారు.

# కేసీఆర్ సీఎం అయితే... జీతాలు కష్టమే

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** పొరపాటున మళ్లీ సీఎం అయితే పీఆర్సీ దేవుడెరుగు? జీతాలకే ఎసరు పెడతాడు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశమంతా ఆశ్చర్యపోయే "పే స్కేల్" ఇదేనా? అంటూ ప్రశ్నించారు. ఉద్యోగులను కడుపులో పెట్టుకుని చూసుకుంటానన్నవ్ కదా? అని మండిపడ్డారు. నిండు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన హామీలన్నీ ఉత్తమాటలేనా? అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే 27 శాతం మధ్యంతర భృతి ఇస్తే? మీరు చేసిందేమిటి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరపాటున మళ్లీ సీఎం అయితే పీఆర్సీ దేవుడెరుగు? జీతాలకే ఎసరు పెడతాడు అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను నమ్మించి మోసం చేశారని అన్నారు. తెలంగాణ ఉద్యోగులను కడుపులో పెట్టుకుని చూసుకుంటానని, దేశమే ఆశ్చర్యపోయేలా పే స్కేల్ ఇస్తానని సాక్షాత్తు నిండు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన కేసీఆర్? ఇచ్చిన మాట పూర్తిగా తప్పారని మండిపడ్డారు. గడువు ముగిసిన 3 నెలల తరువాత నూతన వేతన సవరణ సంఘాన్ని నియమించిన కేసీఆర్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5 శాతం మాత్రమే మధ్యంతర భృతి ఇస్తున్నట్లు ప్రకటించి వారికి అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉద్యోగులకు 3 డీఏలు (10.92 శాతం) పెండింగ్ లో ఉండగా 5 శాతం ప్రకటించడం హాస్యాస్పదమని బండి సంజయ్ అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 27 శాతం మధ్యంతర భృతి ఇచ్చిన సంగతిని కేసీఆర్ గుర్తుంచుకోవాలని అన్నారు. ఆ సమయంలోనే తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని పదేపదే మొత్తుకున్న కేసీఆర్? స్వరాష్ట్రం వచ్చాక కేవలం 5 శాతం మధ్యంతర భృతి ఇవ్వడాన్ని ఏమనుకోవాలి? మండిపడ్డారు. కేసీఆర్ పాలనా పుణ్యమా? అని 317 జీవో పేరుతో స్వరాష్ట్రంలోనే ఉద్యోగులు స్థానికేతరులుగా మారి చెట్టుకొకరు పుట్టకొకరుగా బతుకీడుస్తున్నారని అన్నారు. బదిలీలు, ప్రమోషన్లు లేక అల్లాడుతున్నరని, ఏటా ఖాళీ అవుతున్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో పనిభారం ఎక్కువై ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ తరుణంలో 5 శాతం మధ్యంతర భృతి ప్రకటించడం.. ఉద్యోగులను మరింత నిరాశ, నిస్పృహల్లోకి నెట్టివేయడమే అవుతుందన్నారు. ప్రభుత్వానికి భజన చేసే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలని తెలిపారు.రాష్ట్రాన్ని నిండా అప్పుల్లో ముంచిన కేసీఆర్ పాలనలో ప్రస్తుతం ఉద్యోగులకు సక్రమంగా జీతాలిచ్చే పరిస్థితే లేదన్నారు. పొరపాటున మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పీఆర్సీ అమలు దేవుడెరుగు 3, 4 నెలలకోసారి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి ఏర్పడే ప్రమాదం లేకపోలేదని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులారా? ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని తెలిపారు.



ఎమ్మెల్యే కిషన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్న లష్కర్ గుడా గ్రామవాసులు

## స్వచ్ఛందంగా బీఆర్ఎస్ లో చేరికలు

### - ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



- ఎమ్మెల్యే కిషన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్న భాను తండా వాసులు

**అబ్దుల్లాపూర్ మెట్/యాచారం - ప్రభాత సూర్యుడు :** ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడ గ్రామానికి చెందిన 60 మంది, యాచారం మండలం భాను తండా గ్రామానికి చెందిన 30 మంది మహిళలు, యువకులు రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమక్షంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై భారీ సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలోకి వలసలుగా వస్తున్నారని అన్నారు. రాబోవు ఎన్నికల్లో బిఆర్ఎస్ ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సీకా సాయికుమార్ గౌడ్, సర్పంచ్ ఏసూరి పారిజాత శేఖర్, యాచారం మండల పార్టీ అధ్యక్షుడు కర్నాటి రమేష్, లస్కర్ గుడా గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, నాయకుకు బాల్ రాజు, చక్రపాణి, చిరుమాముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం ఎమ్మెల్యే

**నందికొట్కూరు - ప్రభాత సూర్యుడు :**
పేదలకు సీఎం రిలీఫ్ పండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ అన్నారు. ఈ సందృంగా ఆయన మాట్లాడుతూ ...జూపాడు బంగ్లా మండల వాస్తవులు తరిగోపుల వెంకటేశ్వర్లకు 63 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ రావడం జరిగిందని లబ్ధిదారులు కర్నూల్ లోని సన్ షైన్ హాస్పిటల్‌లో చికిత్స చేయించు కుంటున్నారని తెలుసుకొని స్వయంగా ఎమ్మెల్యే ఆర్థర్ హాస్పిటల్ కి వెళ్లి వారికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిది 63 వేలను అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం అక్కడ డాక్టర్ లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. సీఎం చెక్కును స్వయంగా వచ్చి అందజేయడం చూసి, ఎమ్మెల్యే ఆర్థర్ కిలబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియ జేయడం జరిగింది. ఇటువంటి ఎమ్మెల్యేను మేము ఎన్నడూ చూడలేదని మళ్లీ మీరే ఎమ్మెల్యేగా రావాలని వారు హర్షం వ్యక్తం చేశారు.

## గుమ్మడిదల మండలంలో పర్యటించిన పఠాన్ చేరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**సంగారెడ్డి జిల్లా - ప్రభాత సూర్యుడు :**
మండల పరిధిలోని 13 గ్రామాల్లో శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసినా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన మాట్లాడుతూ ఒకేరోజు గుమ్మడిదల మండల పరిధిలోని 13 గ్రామాల్లో 12 కోట్ల 50 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంబొత్సవాలు శంకుసా ్థపనలు చేసుకోవడం ఆషామాషీ కాదు,పఠాన్ చేరు అసెంబ్లీ అంటే మినీ ఇండియా 28 రాష్ట్రాలకు సంబందించిన ప్రజలు ఇక్కడ ఉంటారు,తెలంగాణ వచ్చాక ప్రజల అవసరాలను బట్టి వారికి అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నాం, ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి,ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలో మొదటి వరుసలో నిలపెట్టడానికి నావంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## అంగన్వాడి, ఆశ వర్కర్లును అరెస్టు చేసిన పోలీసులు

**కోరుట్ల - ప్రభాత సూర్యుడు :** జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారం భోత్సవం నైపథ్యంలో మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ జగిత్యాల జిల్లా పర్యటన సందర్భంగా నియోజకవర్గం లోని కోరుట్ల, మెట్ పల్లి అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్నం భోజనం వర్కర్స్‌లను మంగళవారం ఉదయం కోరుట్ల, మెట్ పల్లి పోలీసులు అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. తమ హక్కుల సాధన కోసం శాంతి యుతంగా నిరసన చేస్తుంటే తమని అక్రమంగా అరెస్టు చేయడానికి ఖండిస్తున్నట్లు అంగన్వాడి, ఆశా వర్కర్లు, మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ నేతలు తెలిపారు. ఈ అరెస్టులో అంగన్వాడి రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరి, అంగన్వాడి టీచర్లు హిమగిరి, సుజాత, మధ్యాహ్నం భోజన వర్కర్స్, ఆశ వర్కర్లు అసోసియేషన్ నాయకురాలు ఉన్నారు.

# సునీల్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరికలు



**మంథని - ప్రభాత సూర్యుడు :** మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావ్ మండలం చిన్నతుండ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విజయగిరి సుదర్శన్ , కాంగ్రెస్ మాజీ గ్రామశాఖ అధ్యక్షురాలు బందెల లక్ష్మి తో పాటు సుమారు 30 మంది మహిళలు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి సమక్షంలో బీజేపీ పార్టీ లో చేరారు. వీరికి సునీల్ రెడ్డి కండువాలు వేసి పార్టీ లోకి ఆహ్వాని ంచారు. అనంతరం సునిల్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకి సముచిత స్థానం బిజెపితోనే సాధ్యంమన్నారు. ఒక చారిత్రక నిర్ణయంతో చట్టసభల్లో 33 శాతం మహిళా బిల్లును ప్రవేశపెట్టి ప్రపంచానికి భారతదేశాన్ని మార్గదర్శకంగా ప్రధాని మోదీ చేశారన్నారు, ఆడవారికి రిజర్వేషన్ కల్పించి మహిళా శక్తిని దేశానికి తెలియజేసేలా కృషి చేస్తున్నారన్నారు, ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, లాంటి పథకాలను పేద ప్రజలకు చెందేలా బిజెపి ప్రభుత్వం కృషి చేస్తే ఇక్కడ టిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం వారి కార్యకర్తలకు నాయకులకు చందేల పథకాలను తయారుచేసింది, పేద ప్రజలకు చెందాల్సిన ఇందిరమ్మ ఇళ్లలో కాంగ్రెస్ నాయకులు తీవ్ర అవినీతిని చేసి కోట్ల రూపాయలు సంపాదించారని, ఎన్నికల్లో కోట్లు పంచాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు, బిజెపి ప్రభుత్వం వస్తేనే మంథని నియోజకవర్గ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఉచిత విద్య వైద్యం బిజెపి పార్టీ సిద్ధాంతం, కరోనా లాంటి ఈ విపత్కర సమయంలో ఉచిత టీకాలు, ఇప్పటివరకు ఉచిత రేషన్ ఇచ్చి పేద ప్రజలకు ప్రధాని మోదీ బాసటగా నిలిచారన్నారు, మహిళలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేలా కుటీర పరిశ్రమలను, మహిళ పొదుపు పథకాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. రానున్న రోజుల్లో బిజెపి పార్టీని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కామోహన్ రావ్, మండల అధ్యక్షులు ముడతన పల్లి ప్రభాకర్,జిల్లా అధికార ప్రతినిధి పోతారవేణి క్రాంతికుమార్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గంగాధరి సమ్మయ్య, సీనియర్ నాయకులు పులిగంటి రాయమల్లు, మేకల రాజు, కోరబోయిన మల్లికార్జున్, మంథని పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు :**
ఓటుకు నోటు కేసులో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఓటుకు నోటు కేసు అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి రాదని, ఏసీబీ పరిధిలోకి రాదంటూ రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఇరు వర్గాల వాదనలు వినింది. ఈ కేసులో ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నాయని, అన్నీ విషయాలు ట్రయల్ కోర్టుకు ఇచ్చామని తెలంగాణ ప్రభుత్వం తరపు లాయర్లు వాదించారు. ఈ కేసు ఏసీబీ పరిధిలోకి రాదని, కేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి తరపు న్యాయవాదులు వాదించారు. ఇరు వర్గాల వాదనల అనంతరం రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. దీంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి షాక్ తగిలినట్లు అయింది.గతంలో ఓటుకు నోటు కేసుకు సంబంధించి హైకోర్టును రేవంత్ ఆశ్రయించారు. అసలు ఈ కేసు ఏసీబీ పరిధిలోకి రాదంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే రేవంత్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును రేవంత్ రెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఇవాళ జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, సంజీవ్ ఖన్నాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదోపవాదనలు అనంతరం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ కేసులో రేవంత్ తదుపరి కార్యాచరణ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.తెలుగు రాష్ట్రాల్లో ఓటుకు నోటు కేసు ఎంత పెద్ద సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఏకంగా అప్పటి ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ కేసులో చిక్కుకోవడంతో తెలుగునాట కలకలం రేపింది. రేవంత్ రెడ్డి సమక్షంలో ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్‌తో చంద్రబాబు ఫోన్ కాల్ మాట్లాడిన ఆడియో ప్రకంపనలు సృష్టించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలుపొందేందుకు స్టీఫెన్‌సన్‌కు డబ్బులు ఆఫర్ చేయగా.. ఆయన ఇంట్లో రేవంత్ రెడ్డి డబ్బుల బ్యాగ్‌తో అడ్డంగా ఏసీబీకి బుక్ అయ్యారు. ఈ కేసులో రేవంత్ రెడ్డి కొద్ది నెలల పాటు జైల్లో ఉండి, ఆ తర్వాత బెయిల్‌పై బయటకొచ్చారు. ఈ కేసులో చంద్రబాబును కూడా ముద్దాయిగా చేర్చాలని మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎప్పటినుంచో న్యాయపోరాటం చేస్తున్నారు. 2017లో ఓటుకు నోటు కేసుకు సంబంధించి సుప్రీంలో ఆళ్ల రామకృష్ణారెడ్డి రెండు పిటిషన్లు వేశారు. ఈ కేసులో చంద్రబాబును కూడా ముద్దుగా చేర్చాలని కోరుతూ ఒక పిటిషన్ వేయగా.. సీబీఐ దర్యాప్తుకు ఆదేశాలు ఇవ్వాలని మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై అక్టోబర్ 4న విచారణ జరగనుంది. ఐటెం నెంబర్ 42గా లిస్ట్ అవ్వగా.. జస్టిస్ సంజయ్ కుమార్, ఎంఎం సుందరేశ్ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టనుంది. తెలంగాణలో ఇప్పటికే ఎన్నికల వేడి మొదలవ్వగా.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు రేవంత్ ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే గత ఎన్నికల్లో ఏపీలో టీడీపీ ఓటమి పాలవ్వగా.. ఈ సారి ఎలాగైనా గెలుపేందుకు చంద్రబాబు ఇప్పటినుంచే వ్యూహాలు రచిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఓటుకు నోటు కేసు మరోసారి తెరపైకి రావడం కీలకంగా మారింది

# ఆరేళ్ల బాలికపై జిమ్ ట్రైనర్ ఆత్యాచారం

**మేడ్చల్ - ప్రభాత సూర్యుడు :**
కామాంధులు రెచ్చిపోతున్నారు. ఆడపిల్ల కనిపిస్తే చాలు మృగాళ్లుగా మారి పోతున్నారు. కామవాంఛతో కన్నుమిన్ను కానక... అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చిన్నా రులను సైతం వదలిపెట్టడంలేదు. వయస్సుతో సంబంధం లేకుండా.. లైంగికదాడి చేస్తున్నారు. అభం శభం తెలియని పసిపాపల జీవితాలతో ఆడుకుం టున్నారు. తెలంగాణా మేడ్చల్ జిల్లా మేడిపల్లిలోనూ ఇలాంటి దారుణమే జరిగింది. మేడిపల్లి పరిధిలోని పీర్జాదిగూడ మల్లికార్జు న్నగర్‌లో ఉంటున్న ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేశారు జిమ్ ట్రైనర్ ఉపేందర్. మల్లికార్జున్‌నగర్‌లో కొత్తగా కడుతున్న ఇంటికి బాలిక తల్లిదండ్రులు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. అయితే.. పనిమీద బయటకువెళ్లారు. ఇంటి దగ్గర బాలిక ఒక్కటే ఉంది. ఇంటి బయట ఆడుకుంటోంది. అదే కాలనీలోని ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న ఉంపేదర్ బాలికను గమనించాడు.ఒంటరిగా ఉండటం చూసి.. ఎలాగైనా లోబరుచుకోవాలని ప్రయత్నించారు. చిన్నారిని మచ్చిక చేసుకునే ప్రయత్నం చేశాడు. చాక్లెట్లు కొనిస్తానని చెప్పి ఆశ పెట్టాడు.జిమ్‌లోకి తీసుకెళ్లాడు. చిన్నపిల్ల అని కూడా చూడకుండా... చిన్నారిపై లైంగిక దాడి చేశాడు. ఏం జరుగుతుందో కూడా అర్థం చేసుకోలేని వయస్సు ఆ చిన్నారిది. అయినా రెచ్చిపోయాడు కామాంధుడు ఉపేందర్. అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు.ఇంతలో ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు... ఇంట్లో బాలిక లేకపోవడంతో అంతా వెతికారు. ఎక్కడా లేకపోవడంతో కంగారుపడ్డారు. అనుమానం వచ్చి పక్కనే ఉన్న జిమ్‌లోకి వెళ్లారు. అక్కడ బాలిక ఏడుస్తూ ఉండటం గమనించారు. ఏం జరిగిందని ప్రశ్నించగా... బాలిక విషయం వారితో చెప్పింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు, స్థానికులు ఇచ్చిన సమాచారంతో.. జిమ్ ట్రైనర్ ఉపేందర్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు పోలీసులు. చిన్నారులను చిధిమేస్తున్న ఇలాంటి కామాంధులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఇలాంటి ఘటనలు పెరిగిపోతాయని... కఠిన శిక్షలు పడితేనే... మరో ఇలాంటి ఘాతుకాలకు తెగబడని అంటున్నారు.

# రైతులకు న్యాయం చేస్తాం

**కరీంనగర్ - ప్రభాత సూర్యుడు :**
జగిత్యాల జిల్లాలో మాస్టర్ ప్లాన్ రైతులకు అన్యాయం జరగకుండా అమలు చేస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. జగిత్యాలలో రాష్ట్రంలోనే అతిపెద్ద డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీ 4 వేల ఇండ్లతో నిర్మించామని తెలిపారు. కాంగ్రెస్ కట్టిన డబ్బా ఇండ్లు ఒక వైపు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఓ వైపు ఉన్నాయని తెలిపారు. ఓటు ఎవరికి వేయాలో తేల్చుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గతం? రాష్ట్రంలో కాంగ్రెస్ ఖతం మని అన్నారు. జగిత్యాలలో మంత్రులు చేయలేని పనులు ఓఒం సంజయ్ చేస్తున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. జగిత్యాల 1956 లోనే మున్సిపాలిటీ.. దాని స్థాయిని దిగజార్చింది కాంగ్రెస్ అంటూ మండిపడ్డారు. జగిత్యాలలో మాస్టర్ ప్లాన్ రైతులకు అన్యాయం జరగకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సంజయ్ ని గెలిపిస్తే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామన్నారు. ఇక్కడ మామిడి రైతులకు మేలు చేసేందుకు పెప్సీ కొకకోలా కంపెనీ యూనిట్ జగిత్యాలకు తెస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ జగిత్యాల జిల్లాలో పర్యటిస్తున్నారు. జగిత్యాలలో 20 ఎకరాల విస్తీర్ణం రూ. 40 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్, నూకపెల్లిలో 280 కోట్లతో నిర్మించిన 4,520 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేసీఆర్ కాలనీ, మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌ను హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, బాల్క సుమన్, సుంకె రవిశంకర్, విద్యాసాగర్‌రావు, ఎంపీ వెంకటేష్ నేతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పర్యటిస్తున్న ఈసీ బృందం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :**
తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం బృందం పర్యటిస్తోంది. సీఈసీ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని బృందం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పర్యటించనుంది. మొత్తం 17 మంది అధికారులు రాష్ట్రంలో పర్యటింస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను సీఈసీ నేతృత్వంలోని బృందం సమీక్షించనుంది. ఇవాళ మధ్యాహ్నం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. మరోవైపు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కూడా సీఈసీ బృందం ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఓటర్ల జాబితా, ఈవీఎంలపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించే అవకాశం ఉంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సీఈసీ బృందం సమావేశం కానుంది. ఈసీ ఒక్కో పార్టీ నుంచి ముగ్గురు ప్రతినిధులను ఆహ్వానించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. దీంతో ఈ ఏడాది డిసెంబర్ 12లోగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. డిసెంబర్ 12 నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈసీ కార్యాచరణ సిద్ధం చేసే అవకాశం ఉంది.మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటించిన ఈసీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215